# నిండిపోర్లుచున్న గిన్నెలు

నా గిన్నె నిండి పొర్లుచున్నది. కీర్తనలు 23:5

## ఉపోద్ఘాతం:

గిన్నె మన ఆత్మీయ జీవితానికి సాదృశ్యంగా ఉన్నది. దేవునిని కాపరిగాగలవారి జీవితాలు ఎప్పుడు నిండి పొర్లే విధంగా వారిని దేవుడు దీవిస్తాడని కీర్తనాకారుడు సెలవిస్తున్నాడు. అనగా మన కాపరి అయిన యేసు మనకు కొదువ లేకుండా అన్నీ ఇస్తాడన్నది మనం సందేహించరాదు. మనం కోరుకున్నవన్నీ ఆయన ఇవ్వకపోవచ్చు గానీ ఆయన్ను అనుసరించి ఆయనలో నమ్మకం ఉంచితే, మనకు అవసరమైన వాటన్నిటినీ ఇస్తాడు. ఎవరైతే క్రీస్తు స్వరాన్ని విని, ఆయనలో నమ్మకం ఉంచి ఆయన్ను అనుసరిస్తూ ఉంటారో వారి జీవితాలు ఎల్లపుడు నిత్య జీవము కొరకైన దైవదీవెనలతో నిండి పొర్లుతూ ఉంటాయి. “నా గొర్రెలు నా స్వరము వినును, నేను వాటినెరుగుదును, అవి నన్ను వెంబడించును. నేను వాటికి నిత్యజీవము నిచ్చుచున్నాను గనుక అవి ఎన్నటికిని నశింపవు, ఎవడును వాటిని నా చేతిలోనుండి అపహరింపడు”. యోహాను 10:27,28; క్రీస్తును ద్వేషించిన సాతాను ప్రపంచం దైవాశీర్వాదాలతో నిండి పోర్లుచున్న మన గిన్నెలను ద్వేషిస్తూ ఉన్నది. (యోహాను 15:18,19);

నిండి పోర్లుచున్న మన గిన్నెలు అనగా మన ఆత్మీయ జీవితాలను చూచిన సైతాను, కోపాగ్నితో మండిపడుతూ, శత్రువులైన వాడి అనుచరులతో మనల్ని చుట్టుముడుతూ ఉన్నాడు. అయినా భయపడవద్దు. మనం ఇటువంటి పరిస్థితులలో ఉన్నా కూడా నమ్మకంగా ఆయనను వెంబడించిన యెడల సాతాను చుట్టుముట్టిన ఈ భయంకరమైన సమయంలోనే మన మంచి కాపరి మంచి మంచి పదార్థాలతో మన గిన్నెలను నింపుచూ ఉన్నాడు. పరిశుద్ధాత్మ తైలంతో మన తలలను అభిషేకిస్తూ ఉన్నాడు. పరిశుద్ధ గ్రంథంలో నుండి నిండి పోర్లుచున్న గిన్నెలను కొన్నింటిని మనం పరిశీలన చేద్దాం.

## 1. ఫరో గిన్నె

ఈ ఫరో గిన్నె ఐగుప్తు సుఖాలతో నిండి పోర్లుచున్నది. ఫరో గిన్నె పాపదాస్యానికి లోకదాస్యానికి సాదృశ్యంగా ఉన్నది. “మరియు ఫరో గిన్నె నా చేతిలో ఉండెను, ఆ ద్రాక్షఫలములు నేను పట్టుకొని ఫరో గిన్నెలో వాటిని పిండి ఆ గిన్నె ఫరో చేతికిచ్చితినని తన కలను అతనితో వివరించి చెప్పెను”. ఆది 40:11; చాలా మంది ఆత్మీయ జీవితాలలో ఇంకా పాపం లోకం కనబడుచున్నది. దేవుని బిడ్డలైన వారి గిన్నెలలో (ఆత్మీయ జీవితాలలో) లోక సంబంధమైన ఆశలు, పాప సంబంధమైన శరీర కోర్కెలు ఉండకూడదు. ఆ విధంగా నీ గిన్నెలో ఐగుప్తు ఆశలు ఉన్నట్లైన దేవుని దీవెనలు నీ గిన్నె లోనికి రాలేవు.

## 2. యోసేపు గిన్నె

యోసేపు గిన్నె పొంగి పొర్లే సహోదర ప్రేమకు సాదృశ్యంగా ఉన్నది. "యోసేపు ఆ మనుష్యుల గోనెలు పట్టినంత ఆహార పదార్థములతో వాటిని నింపి ఎవరి రూకలు వారి గోనెమూతిలో పెట్టుమనియు, కనిష్ఠుని గోనె మూతిలో తన వెండి గిన్నెను అతని ధాన్యపు రూకలను పెట్టుమనియు, తన గృహ నిర్వాహకునికి ఆజ్ఞాపింపగా యోసేపు చెప్పిన మాట చొప్పున అతడు చేసెను". ఆది 44:1 యోసేపు తన సహోదరులను ఎంతగానో ప్రేమించన వాడై వారిని తన దగ్గరకు చేర్చుకొనుటకు తన గిన్నెను ఉపయోగించాడు. ఇది యోసేపు ప్రేమను తెలియజేస్తున్నది. మన గిన్నెలు సహోదర ప్రేమతో నిండి ఉండాలి. అప్పుడే మన గిన్నెలు నిండి పొర్లే విధంగా దేవుడు దీవిస్తాడు.

## 3. మన్నాగల గిన్నె

మన్నాగల గిన్నె వాక్యంతో నింపబడి పోర్లుచున్న హృదయానికి సాదృశ్యంగా ఉన్నది. "కాబట్టి మోషే అహరోనుతో నీవు ఒక గిన్నెను తీసికొని, దానిలో ఒక ఓమెరు మన్నాను పోసి మీ వంశస్థులు తమ యొద్ద ఉంచుకొనుటకు యెహోవా సన్నిధిలో దాని ఉంచుమనెను'. నిర్గ 16:33; దేవుని బిడ్డల ఆత్మీయ ఆకలిని తీర్చే మన్నా అను వాక్యంతో మన గిన్నెలను నింపు కోవాలి. అప్పుడే మన గిన్నెలు నిండి పొర్లే విధంగా దేవుడు దీవిస్తాడు. దేవుని ఉపదేశాలను ఎల్లపుడు హృదయంలో నింపుకుంటూ ఆనందిస్తూ ధ్యానిస్తూ ఉండడం వల్ల ఆధ్యాత్మిక పోషణ, ఎడతెగని ఫలాలు, విజయం మొదలగు దీవెనలు పొంగి పోర్లగలవు. దేవుని ప్రజల జీవానికి, అభివృద్ధికి పరలోక మన్నా అని పిలువబడిన వాక్యం ఎంతో అవసరం. దేవుని వాక్యాన్ని అస్తమానం హృదయంలో నింపుకుంటూ ఆంనందంతో దాన్ని ధ్యానిస్తూ ఉండే వ్యక్తి తాను దీవెనలు ప్రవహించే నది పక్కనే ఉన్నాననీ దేవుని ఆత్మ తన చుట్టూ తనలో ఉన్నాడనీ తెలుసుకుంటాడు. "అతడు నీటికాలువలయోరను నాటబడినదై ఆకు వాడక తన కాలమందు ఫలమిచ్చు చెట్టువలెనుండును అతడు చేయునదంతయు సఫలమగును". కీర్తన 1:3

## 4. హీరాము గిన్నె

హీరాము గిన్నె దేవాలయ పరిచర్యకు సాదృశ్యంగా ఉన్నది. "మరియు హీరాము తొట్లను చేటలను గిన్నెలను చేసెను. ఈ ప్రకారము హీరాము రాజైన సొలొమోను ఆజ్ఞనుబట్టి యెహోవా మందిరపు పనియంతయు ముగించెను."

1 రాజు 7:40; హీరాము అను భక్తుడు దేవాలయ పరిచర్య కొరకు గిన్నెలను తయారు చేస్తున్నాడు. దేవాలయ పరిచర్యలో మన గిన్నెలు వాడబడాలి. అనగా దేవుని పరిచర్యతో మన గిన్నెలు నింపబడాలి. అప్పుడే మన గిన్నెలు నిండి పొర్లే విధంగా దేవుడు దీవిస్తాడు. దేవుని సేవలో పరిచర్యలో ఎవరు ఒక గిన్నెడు చనీళ్ళు ఇస్తారో వాళ్ళకు దేవుని నుండి తప్పకుండా ప్రతిఫలం లభిస్తుంది, "మరియు శిష్యుడని యెవడు ఈ చిన్నవారిలో ఒకనికి గిన్నెడుచన్నీళ్లు మాత్రము త్రాగనిచ్చునో వాడు తన ఫలము పోగొట్టుకొనడని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను". మత్తయి 10:42

## 5. నేహెమ్యా గిన్నె

నేహెమ్యా గిన్నె సంఘ పరిరక్షణకు సాదృశ్యంగా ఉన్నది. “యెహోవా చెవియొగ్గి నీ దాసుడనైన నా మొఱ్ఱను, నీ నామమును భయభక్తులతో ఘనపరచుటయందు ఆనందించు నీ దాసుల మొఱ్ఱను ఆలకించి, ఈ దినమందు నీ దాసుని ఆలోచన సఫలపరచి, ఈ మనుష్యుడు నాయందు దయచూపునట్లు అను గ్రహించుమని నిన్ను బతిమాలుకొనుచున్నాను, అని ప్రార్థించితిని. నేను రాజునకు గిన్నె అందించువాడనై యుంటిని” నేహెమ్యా 1:11

యేరుషాలేము ప్రాకారములను కట్టుటకై నేహెమ్యా ఎంతగానో ఆసక్తి చూపించాడు. యేరుషలేము శత్రువులబారి పడకుండా దానికి ప్రాకారములు అవసరమై యున్నవని నేహెమ్యా గ్రహించాడు. ఆ కార్యాన్ని చేయుటకు ఎంతో ఆసక్తితో నేహెమ్యా శ్రమించాడు. ప్రియ దేవుని బిడ్డలారా! శత్రువులు దేవుని సంఘాన్ని నాశనం చేయుటకు చూస్తున్న ఈ రోజులలో నేహెమ్యా మాదిరిగా సంఘం చుట్టూ ప్రాకారాలు కట్టుటకు నీలో ఆసక్తి ఉన్నదా? సంఘ పరిరక్షణ కేవలం పాస్టర్ల పని మాత్రమే కాదు. ఆ పనిని చేయుటకు నేహెమ్యా యాజకుల కోసం చూడలేదు. తానే స్వయంగా ప్రాకారాలు కట్టుటకు పూనుకున్నాడు. దేవుని సంఘాన్ని పరిరక్షించే ఆసక్తితో నీ గిన్నె నింపబడాలి. అప్పుడే మన గిన్నెలు నిండి పొర్లే విధంగా దేవుడు దీవిస్తాడు.

## 6. శ్రమల గిన్నె

శ్రమల గిన్నె ప్రార్థనకు సాదృశ్యంగా ఉన్నది. “కొంతదూరము వెళ్లి సాగిలపడి -నా తండ్రీ, సాధ్యమైతే ఈ గిన్నె నా యొద్దనుండి తొలగిపోనిమ్ము, అయినను నా యిష్టప్రకారము కాదు నీ చిత్తప్రకారమే కానిమ్మని ప్రార్థించెను”. మత్తయి 26:39; సర్వలోక పాప పరిహారార్థం యేసు తన చెమట రక్తంగా మారునంతగా ప్రార్థన చేశాడు. దేవుని కుమారుడై యున్న యేసుకు ప్రార్థన చేయవలసినఅవసరం ఉన్నదా? ఇది నీకు నాకు మాదిరికరం. అనుదినం మన గిన్నెలను ప్రార్థనతో నింపుకొనవలసి యున్నది. చాల మంది ఆత్మీయ జీవితాలు (గిన్నెలు) ప్రార్థనా లేమితో ఉన్నవి. ఎవరి జీవితాలైతే ప్రార్థనలతో నిండి ఉంటాయో అప్పుడే దైవ దీవెనలతో వారి గిన్నెలు నిండి పొర్లి పారగలవు.

## 7. రక్తపు గిన్నె

ఇది క్రీస్తు పరిశుద్ధ బల్లారాధనకు సాదృశ్యంగా ఉన్నది. “ఆ ప్రకారమే భోజనమైన తరువాత ఆయన గిన్నె పట్టుకొని - ఈ గిన్నె మీకొరకు చిందింపబడుచున్న నా రక్తమువలననైన క్రొత్తనిబంధన”. లూకా 22:20; తన పరిశుద్ధ రక్తానికి గిన్నెలో ఉన్న ద్రాక్షారసము సాదృశ్యమైనదని ప్రభువు తన శిష్యులకు చెప్పినాడు, తనను జ్ఞాపకం చేసుకుంటూ దానిని పుచ్చుకొనునప్పుడు తనను మీరు స్వీకరిస్తున్నారు అని చెప్పుచున్నాడు. గిన్నెలో ఉన్న యేసు రక్తం పవిత్రం గనుక బల్లారాధన ఎంతో పవిత్రముగా ఆచరించవలసి యున్నది. కాని చాలామంది జీవితాలలో బల్లారధన పట్ల నిర్లక్ష్యం, అశ్రద్ధ కనబడుచున్నవి. బల్లారాధన కొరకు సరైన సిద్ధపాటు కనబడడంలేదు. ప్రియ దేవుని బిడ్డలారా! బల్లారాధన

పరిశుద్ధమైన సంస్కార కార్యమని గ్రహించి సరైన సిద్ధపాటుతో నీ గిన్నెను నింపుకొని యోగ్యంగా బల్లలో పాలుపొందుకుంటే దైవ దీవెనలతో నీ గిన్నె నిండి పొర్లిపారగలదు.

## ముగింపు

మనలను వ్యతిరేకించే అపవాది మరియు శత్రువులు మన గిన్నెలను నాశనం చేయుటకు ప్రయత్నం చేస్తున్నారనే విషయాన్ని మనం ఎప్పుడు మర్చిపోక ప్రభువుని నిత్యం వెంబడించాలి. అసలు ఇంతకూ మనం ఆ కాపరిని అనుసరిస్తున్నామా, ఆయన నీతి న్యాయం నిజాయితీ కోసం ధైర్యంగా నిలబడుతున్నామా అంటూ మనల్ని మనం ప్రశ్నించుకోవాలి. మన గిన్నెలను లోక దాస్యానికి పాప క్రియల కొరకు వాడక పరిశుద్ధమైన దేవుని పరిచర్య కొరకు వాడి ధన్యులమవుదాం. దేవుడు మన గిన్నెలను పొంగి పొర్లే విధంగా నింపుతున్నందుకు కృతజ్ఞత గలిగి రక్షణ పాత్రను చేత బట్టుకుని ప్రార్థన చేద్దాం. “రక్షణపాత్రను చేత పుచ్చుకొని యెహోవా నామమున ప్రార్థన చేసెదను” కీర్తన116:13 ;

నిండి పోర్లుచున్న మీ గిన్నెలను (ఆత్మీయ జీవితాలను) దేవుడు బహుగా దీవించి ఆశీర్వదించును గాక! ఆమెన్!!